తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
పేజీలు : 08
ఆదివారం
17 ఆగస్ట్ 2025



# ఎన్నికల జాప్యం.. పంచాయతీలకు శాపం!

- పాలకవర్గాలు లేక విడుదల కాని కేంద్రం నిధులు
- కాంగ్రెస్‌కు దడ పుట్టిస్తున్న బీసీ రిజర్వేషన్లు

**వనపర్తి,ఆగష్టు16(జనంసాక్షి):**సుమారు ఏడాదిన్నర కాలంగా గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుపకుండా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న జాప్యం వాటి పట్ల శాపంగా మారింది.ప్రజలచే ఎన్నుకోబడిన పంచాయతీలు కొలువు తీరి ఉన్నప్పుడు మాత్రమే పంచాయతీలకు కేంద్ర నిధులు అందుతాయి. అయితే తెలంగాణలో గ్రామ పంచాయతీల గడువు 2024 జనవరిలోనే ముగిసింది. ఇక అక్కడి నుంచి కారాణాలు ఏవైనా పంచాయతీ ఎన్నికలకు ముహూర్తం ముడి పడడంలేదు.తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు ఆలస్యం అయ్యే కొద్దీ.. కేంద్రం నుంచి పంచాయతీలకు రావసిన కేంద్ర నిధులు రాకుండా ఆగి పోతున్నాయి.దీంతో గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి తూట్లు పడుతున్నాయని ప్రజాస్వామిక వాదులు ఆంధోళన చెందుతున్నారు. అధికార పీఠం దక్కించు కోవడానికి రాజకీయ పక్షాలు చేస్తున్న అలవి కాని హామీలు ప్రజా సంక్షేమాన్ని పక్క దారి పట్టిస్తున్నాయని, అందులో భాగమే స్థానిక సంస్థల్లో బీసీల 42 శాతం రిజర్వేషన్ల అమలు తెగని సమస్యగా మారిందని అంటున్నారు.

**పాలకవర్గాలు లేక విడుదల కాని కేంద్రం నిధులు**

1992లో రాజీవ్ గాంధీ ప్రభుత్వం తెచ్చిన 73వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం పంచాయతిరాజ్ మూడంచెల వ్యవస్థలైన గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్ లకు ఐదేళ్ళకోసారి క్రమం తప్పకుండ ప్రజల చేత ఎన్నుకోబడిన పాలకవర్గాలు లేకుంటే కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి నిధులను కేటాయించదు. ఈ కారణంగా ఇప్పటికే, కేంద్ర ప్రభుత్వం 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్రానికి రావలసిన రూ.1,550 కోట్లను రిలీజ్ చేయకుండా విత్ హెల్డ్ లో పెట్టింది.అంటే నిధుల విడుదలను నిలుపుదల చేసింది. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబందించి రూ.1,450 కోట్లు కూడా విడుదల కాలేదు. అంటే పంచాయతీ ఎన్నికలు సకాలంలో నిర్వహించక పోవడం వలన రాష్ట్రంలోని



గ్రామ పంచాయతీలు ఇంచుమించుగా రూ.3000 కోట్లు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. మరో వంక నిధుల కొరతతో అల్లాడుతున్న గ్రామ పంచాయతీలకు ప్రాణప్రదంగా భావించే కేంద్ర నిధుల విడుదల కావాలంటే,స్థానిక సంస్థల ఎన్నికలు తక్షణం నిర్వహించడం మినహా మరో మార్గంలేదన్నది పంచాయతీరాజ్ శాఖ అధికారుల సమాచారం.

**ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహించినా..**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ గండం నుంచి గట్టెక్కేదారి కనిపించక రేవంత్ రెడ్డి ప్రభుత్వం తికమక పడుతోంది. ఇతర అంశాలు ఎలా ఉన్నా,రాష్ట్రంలో గ్రామ పంచాయతీలు ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభ పరిస్థితుల దృష్ట్యా ముందు కేంద్ర గ్రాంట్స్ తెచ్చుకోవడం పై దృష్టి పెట్టాలి, లేదంటే, పంచాయతీల పరిస్థితి మరింత అధ్వాన స్థితికి దిగజారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నిజానికి, ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహించినా, గత ఆర్థిక సంవత్సరానికి సంబందించిన రూ.1,550 కోట్లు విడుదల అవుతాయనే నమ్మకం లేదనీ, గడువు ముగిసిన గత సంవత్సరం నిదుల విడుదల పూర్తిగా కేంద్ర ప్రభుత్వం విచక్షణాదికార పరిధిలోకే వస్తుందనీ, అందువల్ల గత ఆర్థిక సంవత్సరానికి సంబందించిన రూ.1,550 కోట్లు విడుదల చేసే అంశం కేంద్ర ప్రభుత్వం దయా దాక్షిణ్యాల పైనే ఉంటుందని భావిస్తున్నారు.

అయితే,గతంలో ఎన్నికలు నిర్వహించిన వెంటనే విత్ హెల్డ్ లో పెట్టిన నిధులను విడుదల చేసిన అనుభవాల ఉన్నాయి కాబట్టి, ఎన్నికలు జరిగితే గత, ప్రస్తుత సంవత్సరాలకు సంబందించిన రూ. 3000 కోట్లు విడుదలవుతాయనే విశ్వాసాన్ని పంచాయతీ శాఖ అధికారాలు వ్యక్తం చేస్తున్నారు.అలాగే ఈలోగా ఎన్నికల జాప్యానికి కారణాలను వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రనికి లేఖ రాస్తే, కేంద్ర నిధులు విడుదల అవుతాయని కొందరు అధికారులు అంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అంశం రోజురోజుకూ మరింత జటిలం అవుతున్న నేపథ్యంలో, ఈ చిక్కు ముళ్ళు వీడి, పంచాయతీ ఎన్నికల జరగడం ప్రస్తుత పరిస్థితిలో సాధ్యమేనా అన్న సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. కాగా స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబర్ 30లోగా నిర్వహించాలని హై కోర్టు గడువు విధించింది. ఈ అన్నిటినీ మించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతనే ఎన్నికలకు వెళ్ళాలని బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. లేదంటే అంటూ రాజకీయ హెచ్చరికలు చేస్తున్నాయి. లేకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో మా తడాఖా చూపుతామని చేస్తున్న సవాళ్ళు పాలకపక్షానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తన్నదనడంలో ఎలాంటి సందేహం లేదన్నది నిర్వివాదాంశం.



## ఓ పక్క తల్లి బాధ్యతలు మరోపక్క విధులు



**ఝరాసంగం,ఆగస్టు 16(జనం సాక్షి):** ఓ పక్క తల్లి బాధ్యతలు మోస్తూనే మరో పక్క ప్రభుత్వ విధులకు హాజరౌతూ తనకు ఉద్యోగం పట్ల ఉన్న నిబద్ధతను చాటుకుంటుంది మేదపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి కాంచన రాథోడ్. గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రభుత్వం పంచాయతీరాజ్ ఉద్యోగులకు సెలువులు రద్దు చేయడంతో తప్పనిసరి విధులకు హాజరు కావలసిన పరిస్థితి ఉంది. గ్రామాలలో వాగులు,వంకలు పొంగి పొర్లుతున్నందున ఆ పరిసర ప్రాంతాలకు ప్రజలు వెళ్ళకుండా చూడాల్సిన బాధ్యత గ్రామ పంచాయతీ కార్యదర్శులపై ఉంది.ఈ నేపథ్యంలో మేదపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి తన 8 నెలలు చంటి బిడ్డను ఇంత చల్ల వాతావరణం ఉన్నప్పటికి అటు తల్లిగా పాప ఆలనా పాలనా చూసుకుంటూనే ఇటు ఉద్యోగ బాధ్యతలను సైతం నిర్వహిస్తూ విధులపట్ల తనకున్న నిబద్ధతను చాటుకుంటూ గ్రామస్తుల మన్ననలు అందుకుంటుంది. మిగితా పంచాయతీ కార్యదర్శులు ఈమెను ఆదర్శంగా తీసుకుని తమ బాధ్యతలు నిర్వహించాలని అధికారులు పలు గ్రామాల ప్రజలు సూచిస్తున్నారు.



## చేర్యాల పట్టణంలో క్షుద్ర పూజల కలకలం

కిరాణా షాపు ముందు దంపతుల ఫోటోతో పూజలు

వార్త మెయిన్‌లో..

## భారతీయ జనతా పార్టీ జిల్లా కమిటీ సభ్యుల నియామకం




**మహబూబ్ నగర్ బ్యూరో ఆగస్టు 16 (జనం సాక్షి) :** బిజెపి పాలమూరు జిల్లా అధ్యక్షులు పి.శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో భారతీయ జనతా పార్టీ జిల్లా కమిటీ సభ్యుల నియామకానికి సంబంధించి శనివారం అధికారికంగా విడుదల చేశారు. జిల్లా ఉపాధ్యక్షులుగా భరత్ భూషణ్. (కొత్తకోట), చిల్ల గాల్ రెడ్డి మొల్గర, క్రిస్టియ నాయక్, కురువ రమేష్ (సీసీ కుంట), రాపోతుల శ్రీనివాస్ గౌడ్, కొండ బుచ్చిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొత్తకోట కిరణ్ కుమార్ రెడ్డి, నాగిలి గారి రమేష్ కుమార్, ఎన్ రాజేశ్వర్, జిల్లా కార్యదర్శులుగా, పద్మ వేణి, సబి రెడ్డి నారాయణమ్మ (కొత్తకోట), తాటి వెంకటేశ్వరమ్మ, సంఘాల రవీందర్ రెడ్డి (రేకులంపల్లి), జి అశోక్ కుమార్, పోతుల రాజేందర్ రెడ్డి, జిల్లా కోశాధికారిగా డాక్టర్ వెంకటయ్య (హన్వాడ), జిల్లా కార్యాలయ ప్రముఖ్ జాజం సుబ్రహ్మణ్యం, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్‌గా పతంగే విశాల్, మీడియా సెల్ జిల్లా కన్వీనర్‌గా కె .సతీష్ కుమార్, ఐటీ సెల్ జిల్లా కన్వీనర్‌గా వడ్ల శ్రీధర్ (హన్వాడ), జిల్లా కార్యవర్గ సభ్యులను, జిల్లా మోర్చాల కమిటీసభ్యులను త్వరలో నియమించి ప్రకటిస్తామన్నారు.

## భారీ వర్షాలకు తెగిన బ్రిడ్జి

సందర్శించిన ఎమ్మెల్యే పట్లోళ్ల డాక్టర్ సంజీవ రెడ్డి

## నిరుపేదలకు అండగా మేఘారెడ్డి

జూలైలో 29 ఎల్ఓసీలు, 239 సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

## ఖజానా జ్యువెల్లరీ షాపు చోరీలో పురోగతి

బీహార్ అంతర్రాష్ట్ర ముఠా ప్రమేయం

పై వార్తలు మెయిన్ పేజీలో

## విద్యార్థులకు పెన్నులు బహుకరించిన పూర్వ విద్యార్థి



**నంగునూరు, ఆగస్టు 16,(జనంసాక్షి):** నంగునూరు మండలం నర్మెట గ్రామానికి చెందిన దానంపల్లి కనకయ్య అనే పూర్వ విద్యార్థి నర్మెట ఉన్నత పాఠశాల విద్యార్థులందరికీ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా పెన్నులు అందించారు. వృత్తిరీత్యా హైదరాబాదులో నివాసం ఉంటున్న కనకయ్య శుక్రవారం తాను చదివిన పాఠశాల అయిన నర్మెట ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న 300 మంది విద్యార్థులకు పెన్నులు అందించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల, కేజీబీవీ ఉపాధ్యాయులకు డైరీలు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్మెట మాజీ ఎంపీటీసీ శనిగరం బాబు, ముష్కీర్ పరశురాములు, పూర్వ విద్యార్థులు చేర్యాల నాగేంద్ర బాబు,దాచవరం రాజశేఖర్, లింగంపల్లి రాజు, నందగిరి శేఖర్ పాల్గొన్నారు.

## భారీ వర్షాలతో కూలిన ఇండ్లు



**చిలప్ చేడ్,16 ఆగస్టు (జనంసాక్షి) :-** మండలంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పలు గ్రామాలలో పాత ఇల్లు కూలిపోవడం జరిగిందని తాసిల్దార్ సహదేవ్ అన్నారు. గత రెండు రోజుల క్రిందట కురిసిన భారీ వర్షానికి మండల కేంద్రమైన చిలప్ చేడ్ గ్రామంలో ఒక పాత ఇల్లు కూలిపోవడం జరిగింది నిన్న కురిసిన భారి వర్షానికి జగ్గంపేట గ్రామానికి చెందిన నీరుడి లక్ష్మయ్య తండ్రి రామయ్య కు చెందిన పాత ఇల్లు భారీ వర్షం కారణంగా కూలిపోవడం జరిగింది బాధితుడు లక్ష్మయ్యకు ప్రభుత్వం తరపున తగిన సహాయం చేస్తామని తాసిల్దార్ సహదేవ్ అన్నారు. భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తమై పాత ఇళ్లల్లో ఉంటున్న వారు త్వరగా ఖాళీ చేయాలని ప్రజలకు సూచించారు భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తమై అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని ప్రజలకు సూచించారు.

## నిండు కుండల్లా చెరువులు



**ఉర్కొండ ఆగస్టు 16 , (జనంసాక్షి):** మండలంలో నిన్న మొన్నటి వరకు చుక్క నీరు లేక ఎండిపోయిన చెరువులు, కుంటలు ఇప్పుడు కళకళలా లాడు తున్నాయి. గత వారం రోజులలో రెండుసార్లు భారీ వర్షాలు పడటంతో చెరువుల్లోకి కుంటల్లోకి నీరు వచ్చి చేరుతుంది. కొన్ని చెరువులు సగానికి పైగా నిండగా కొన్ని చిన్న చెరువులు అలుగులు పారుతున్నాయి. చెరువులు కుంటలు నిండడంతో ఖరీఫ్ పంటకు డోకా ఉండదని రైతులు ఆశా భావం సంతోషాన్ని వ్యక్తం చేశారు.చెరువులు నిండటంతో బోరు బావులు ఊటప దుతున్నాయి. ఎండి పోతాయన్న పంటలు వర్షం పడటంతో మొక్కజొన్న, పత్తి వేసిన రైతుల ముఖాలలో సంతోషం వ్యక్తం చేశారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు



**మక్తల్, ఆగస్టు 16 (జనంసాక్షి) :** లయన్స్ క్లబ్ మఖ్తల్ భీమా ఆధ్వర్యంలో పట్టణంలోని ఎల్లమ్మ కుంట రోడ్‌లో ఉన్న జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో లయన్స్ క్లబ్ మఖ్తల్ అధ్యక్షుడు సత్యాంజనేయులు సహకారం తో విద్యార్థులకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి సమస్యలు ఉన్న వారికి మందులను అందజేశారు. కంటి ఆరోగ్యానికి సహకరించే కూరగాయలు,పండ్లు, ఆహారం తీసుకోవాలని సూచించారు. సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్న చందాన కంటి చూపును జాగ్రత్తగా కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మఖ్తల్ అధ్యక్షుడు సత్యాంజనేయులు, కార్యదర్శి అంజన్ ప్రసాద్, కోశాధి కారి ఆడెం సత్యనారాయణ, జోన్ చైర్మన్ సూగురు జైపాల్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ మామిళ్ల పృథ్వీరాజ్, సభ్యులు బి. అంబాదాస్ రావు, పాల్గొన్నారు.

# భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- చిలప్ చేడ్ మండలంలో 4 మి.మి వర్షం
- నీట మునిగిన పత్తి వరి పంటలు
- మంజీర పరివాహ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**చిలప్ చేడ్, 16ఆగస్టు (జనంసాక్షి) :**గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాసిల్దార్ సహదేవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా భారీగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి ముందుగా పాత ఇళ్లలో ప్రజలు ఎవ్వరు నివసించకూడదని ఇప్పటికే మండలంలో రెండు మూడు గ్రామాలలో పాత ఇల్లు కూలిపోవడం జరిగింది అందుకుగాను పాత ఇళ్లల్లో ప్రజలు ఎవరూ నివసించకుడదని ప్రత్యామ్నాయంగా వేరే సౌకర్యాలను చూసుకొని జాగ్రత్త పడాలని అన్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఫైజాబాద్ గ్రామంలోని పెద్ద చెరువు తూము నుండి భారీగా నీరు విడుదల కావడంతో ప్రజలు సంబంధిత ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో తాము అధికారులతో అప్రమత్తమై వెంటనే తగు చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించడం జరిగింది. మన చిలప్ చేడ్ మండలం మంజీరా పరివాహక ప్రాంతం కావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంజీర నది వైపు గొర్ల కాపరులు మత్స్యకారులు ఎవరు కూడా అటువైపు వెళ్ళకూడదని ప్రజలకు పలు సూచనలు చేశారు అనంతరం చాముండేశ్వరి ఆలయం వద్ద ఉన్న బ్రిడ్జిని పరిశీలించడం జరిగింది సింగూర్ డ్యాం నుండి దిగువకు నీటిని విడుదల చేయడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండి బ్రిడ్జి వైపు గొర్ల కాపరులు ప్రజలు ఎవరు కూడా రాకుండా ఉండాలని ప్రజలకు ఏదైనా అత్యవసర సమస్య ఉంటేనే బయటకు రావాలని అధికారులు సూచించారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సహదేవ్, ఎంపీడీవో ప్రశాంత్,ఇరిగేషన్ ఏ ఈ హరీష్ రెడ్డి,ఆర్ ఐలు సునీల్,వెంకటేశం,ఎస్సై నర్సింలు, ఏవో రాజశేఖర్ గౌడ్, పంచాయతీ సెక్రెటరీ నాగరాజు, తాజా మాజీ సర్పంచ్ మనోహర నరసింహారెడ్డి, గోపాల్ రావు, సంబంధిత అధికారులు ప్రజలు ఉన్నారు.

# భారీ వర్షాలకు నీట మునిగిన పంటలు



**చిలప్ చేడ్,16ఆగస్టు (జనంసాక్షి) :-** చిలప్ చేడ్ మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, రైతులు అప్రమత్తంగా ఉండాలి ,రాబోయే రెండు రోజుల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, రైతులు పాటించాల్సిన వాతావరణ ఆధారిత వ్యవసాయ సూచనలను వరి, పత్తి వంటి పంట పొలాల నుండి నీరు నిలిచి ఉన్నట్లయితే, త్వరగా బయటకు పంపేందుకు మురుగునీటి కాలువలను ఏర్పాటు చేయాలి.ఎరువుల వాడకం, పైపాటుగా వేసే ఎరువులు, మరియు పురుగు మందుల పిచికారిని తాత్కాలికంగా నిలిపివేయాలి.పంటల వారీగా సూచనలు.వరి పంట నీటిలో మునిగిన పొలాల నుండి నీటిని త్వరగా బయటకు పంపాలి. నాట్లు వేయని రైతులు వర్షాలు తగ్గిన తర్వాత నాట్లు వేయడానికి సిద్ధం కావాలి. సమయం తక్కువగా ఉన్నట్లయితే, వెదజల్లే పద్ధతిలో విత్తనాలు వేయాలి. కలుపు నివారణ చర్యలు తీసుకోవాలి. పంట త్వరగా కోలుకోవడానికి, లీటరు నీటికి 5 గ్రా. చొప్పున 19.19.19 ద్రావణాన్ని లేదా 2 మి.లీ. చొప్పున నానో యూరియా లేదా నానో డీఏపీని పిచికారి చేయాలి.పత్తి: అధిక వర్షాల కారణంగా వడలు తెగులు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు, లీటరు నీటికి 3 గ్రా. కాపర్ ఆక్సీ క్లోరైడ్ కలిపి మొక్కల మొదళ్లలో తడిచే విధంగా పిచికారి చేయాలి. దీనిని వారంలో రెండుసార్లు చేయాలి. పంట త్వరగా కోలుకోవడానికి లీటరు నీటికి 5-10 గ్రా. మల్టీ-కే లేదా 10 గ్రా. యూరియా లేదా 2 మి.లీ. నానో యూరియాను పిచికారి చేయాలి.మొక్కజొన్న పంట పొలంలో నీరు నిలిచి ఉన్నట్లయితే వెంటనే బయటకు పంపే చర్యలు తీసుకోవాలి. భాస్వరం లోపం నివారణకు లీటరు నీటికి 2 మి.లీ. నానో డీఏపీ లేదా 5 గ్రా. 19.19.19 పోషకాన్ని పిచికారి చేయాలి.వర్షాలు తగ్గిన తర్వాత పొలంలో అంతర కృషి చేయడం వల్ల కలుపు మొక్కలను తొలగించడంతో పాటుగా పొలంలో అధిక తేమను తగ్గించుకోవచ్చునని మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ గౌడ్ రైతులకు సూచించారు. రైతులు గోపాలరావు, రాజు, నామ్య, రమేష్, ప్రవీణ్ ఉన్నారు.

## పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత

- కృష్ణాష్టమి పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు





**మక్తల్, ఆగస్టు 16 (జనంసాక్షి) :** శ్రీ కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా మఖ్తల్ పట్టణంలోని చారిత్ర క వేణుగోపాలస్వామి ఆలయంలో నూతన సంప్రదా యానికి మంత్రి వాకిటి శ్రీహరి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి అందుబాటులో లేకపోవడం తో ఆయన తరపున మంత్రి వాకిటి శ్రీహరి సతీమ ణి వాకిటి లలిత స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అంతకుముందు పసుపుల వద్ద ఉన్న కృష్ణానది నుంచి జల్తి బిందె తీసుకువచ్చే కార్యక్రమంలో మంత్రి సతీమణి పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వాకిటి లలిత మాట్లాడుతూ పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయానికి ఎంతో చారిత్రాత్మక ప్రశస్తి ఉందని, స్వామివారిని కొలిచిన వారికి సమస్యలు తొలగి అనుకున్నవన్నీ పూర్తవుతాయని నమ్మకం ఉందని తెలిపారు. ఆలయ పునర్ వైభవానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కట్టా సురేష్ గుప్తా, ఏ రవికుమార్, డాక్టర్ శ్రీరామ్, కోళ్ల వెంకటేష్, మామిళ్ళ కిష్టప్ప ,తిరుపతి నర్సింలు, కావలి శ్రీహరి, కట్టా వెంకటేష్, కావలి ఆంజనేయులు, నాగరాజ్, బోయ వెంకటేష్, ఓబులేష్ గుడెబల్లూరు నాగరాజ్, గుంతలి రవి, కల్లూరి గోవర్ధన్, పాల్గొన్నారు.

# విశ్వజన సంక్షేమమే విశ్వహిందూ పరిషత్ లక్ష్యం

- ఘనంగా విశ్వహిందూ పరిషత్ ఆవిర్భావ దినోత్సవం
- విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ నాయకులు

**మఖ్తల్, ఆగస్టు 16 (జనంసాక్షి) :** మక్తల్ పట్టణంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో విశ్వహిందూ పరిషత్ ఆవిర్భావ దినోత్సవం, శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ నారాయణపేట జిల్లా గౌరవ సలహా సభ్యులు వి. భీమ్ రెడ్డి మాట్లాడుతూ విశ్వజన సంక్షేమమే విశ్వహిందూ పరిషత్ లక్ష్యం అని, హైందవ చైతన్యమే భారత సంక్షేమము దిశగా విశ్వహిందూ పరిషత్ పనిచేస్తుందని తెలిపారు. 1964 వ సంవత్సరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి రోజునే ముంబైలోని సాందీపని ఆవాసంలో పరమ పూజనీయ మాధవరావు సదాశివరావు గొల్వల్కర్ విశ్వహిందూ పరిషత్ ను స్థాపించారని తెలిపారు. ప్రతి హిందువు హిందూ ధర్మ పరిరక్షణకు కంకణ బద్ధలై హైందవ ధర్మాన్ని, సంస్కృతి సాంప్రదాయాలను, కాపాడాలని సూచించారు. భగవాన్ శ్రీకృష్ణుడు జీవితం సర్వ మానవాళికి ఆదర్శనీయమని, పూజనీయమని, ధర్మ పరిరక్షణకై శ్రీకృష్ణుడు చూపిన మార్గదర్శనములో ప్రతి ఒక్కరు ముందుకు నడవాలని సూచించారు. అనంతరం విశ్వహిందూ పరిషత్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మక్తల్ పట్టణంలోని నారాయణ పేట రోడ్డు తిలక్ మార్గ్, అంబేద్కర్ చౌరస్తా, నేతాజీ మార్గ్ చౌరస్తాలో ఓంకార కాషాయ ధ్వజాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్



జిల్లా సహా కాయదర్శి భాస్కర్ రెడ్డి, ప్రఖండ అధ్యక్షులు సత్యనారాయణ గౌడ్, వాకిటి భీమన్న, మల్లికార్జున రావు, తిరుపతి శ్రీను, బజరంగ్ దళ్ నారాయణపేట జిల్లా సహా సంయోజక్ పసుపుల భీమేష్, ప్రఖండ సంయోజక్ రాహుల్, సాహ సంయోజక్ శివ, పరశురాం, నర్సింహా రెడ్డి, కృష్ణ మూర్తి, బజరంగ్ దళ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జాతి గర్వించదగిన నేత వాజ్ పేయ్

- భాజపా బూత్ కమిటీ అధ్యక్షులు .అశోక్ కుమార్



**మక్తల్, ఆగస్టు 16 (జనంసాక్షి) :** భారతజాతి గర్వించదగిన నేత మాజీ ప్రధాని దివంగత అటల్ బిహారి వాజ్ పేయ్ అని భాజపా బూత్ కమిటీ అధ్యక్షులు సి అశోక్ కుమార్ కొనియాడారు. శనివారం మండల పరిధిలోని బిజ్వార్ గ్రామంలో వాజ్ పేయ్ 7వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రధానిగా వాజ్ పేయ్ దూరదృష్టి వల్లే నేడు దేశం ప్రపంచ దేశాలతో పోటీ పడుతుందన్నారు. భారతజాతికి శాంతి మంత్రం జపించడమే కాదు యుద్ధ తంత్రం కూడా తెలుసని నిరూపించిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు మహేష్ గౌడ్ పత్తి ఆంజనేయులు, రఘు, తిరుపతి, డి.నరసింహ, మహేష్, ఎం.నరేష్, నవీన్ గౌడ్, బడే సాబ్, రాములు, ఓంకార్, ఎం.కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

- బిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు
- తగుళ్ల కొండల్ యాదవ్



**వెల్దండ ఆగస్టు 16 (జనంసాక్షి) :** వెల్దండ మండలం లోని పోతేపల్లి గ్రామానికి చెందిన సాకలి అశ్విని కి సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరు అయిన 25,500 రూపాయల చెక్కును శనివారం బిఆర్ఎస్ కార్యకర్తలు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యువ నాయకులు తగుళ్ల కొండల్ యాదవ్, శ్రీనివాస్ ,చిన్న సైదయ్య, వావిల్ల కొండల్, మార్కండేయుడు, శోభన్ చారి,తిరుపతయ్య, శేఖర్, కుమార్, భరత్‌లి తదితరులు పాల్గొన్నారు..

## అక్షర పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**మక్తల్, ఆగస్టు 16 (జనంసాక్షి) :** మక్తల్ అక్షర ఉన్నత పాఠశాలలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారి విద్యార్థిని విద్యార్థులు గోపికలు, శ్రీకృష్ణుని వేషధారణ అందరిని ఎంతో గానో ఆకర్షించాయి. చిన్నారుల నృత్యాలు కోలాటం వంటి సంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాఘవేందర్ రెడ్డి, అడ్వైజర్ భాస్కర్, పాఠశాల ఉపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలో సీఐ



**న్యాల్ కల్, ఆగస్టు 16, (జనంసాక్షి) :** న్యాల్ కల్‌లోని శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం ఆవరణలో శనివారం నిర్వహించిన శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి జహీరాబాద్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జక్కుల హనుమంతు, గ్రామానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. స్థానిక భక్తులతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు ఆలయానికి వచ్చి తెచ్చుకున్నారు. బైపాస్ రోడ్డుపై పగలగొట్టి సంబరాలను జరుపుతున్నారు. కార్యక్రమంలో భక్తులు రామచంద్ర రావు పవర్, నరసింహారెడ్డి, జడ్గొండ మారుతి, నర్సింలు, దత్తు, శివరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే రెండు రోజుల్లో వర్షాలు

### తహసిల్దార్ మాలతి

**చిన్న శంకరం పేట ఆగస్టు 16 (జనంసాక్షి):** భారీ వర్షాల దృష్ట్యా చిన్న శంకరంపేట తాసిల్దార్ బి మాలతి ధర్పల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిని సందర్శించడం జరిగింది ప్రస్తుతం అక్కడ



ఎలాంటి నీటి ప్రవాహం లేదు . ప్రజల రాకపోకలు అంతరాయం లేదు సూరారం మరియు జంగ రాజ్ సర్వర్ తండాలో పాతఇండ్ల వద్దకు వెళ్లి రాబోయే రెండు రోజులలో వర్షాలు ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని తాసిల్దార్ మాలతి ఆర్ఐ రాజు తండా వాసులకు సూచించారు

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**శివ్వంపేట ఆగస్ట్ 16 (జనంసాక్షి):** శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని గూడూర్ శ్రీ గురుఫిఠంలో కొలువైన శ్రీ దత్తాత్రేయ మహాస్వామి పంచాయతానం, షిరిడి సాయిబాబాలతో పాటు ఇదే దేవాలయంలో కొలువైన శ్రీ కృష్ణుడిని శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేసి ఆశీస్సులు పొందారు. అదేవిధంగా శ్రీ దత్తాత్రేయ స్వామి దేవాలయంలో శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో శ్రీ దత్తాత్రేయ మహాస్వామి గురుపరంపరులు, సాయిబాబా దేవతలను కూడా భక్తులు దర్శించుకొని ఫిఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురుపీఠంలో మధ్యాహ్నం హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ జిన్నారం పెద్దగౌని శివకుమార్ గౌడ్, సభ్యులు, న్యాయవాది జిన్నారం రాజం భిక్షపతి యాదవ్, సిబ్బంది బల్కంపేట భాస్కర్ భక్తులు ఉన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే విజయుడు



**మానవపాడు, ఆగస్టు 16 (జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా, అలంపూర్ నియోజకవర్గంలో. 61 మంది లబ్ధిదారులకు అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు రూ.14,81,500/- లక్షల రూపాయల సీఎం ఆర్ ఎఫ్ చెక్కులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, జల్లాపురం లక్కిరెడ్డి కర్ణ సింహారెడ్డి, సామాజిక కార్యకర్త శాంత కుమార్, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**చిన్న శంకరం పేట ఆగస్టు 16 (జనంసాక్షి):** శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు చిన్న శంకరం పేట మండల కేంద్రంలోని శ్రీకృష్ణుని ఆలయంలో ఘనంగా నిర్వహించారు.బాలకృష్ణుడి జన్మదిన వేడుకకు తరలివచ్చిన చిన్నారులు శ్రీకృష్ణ గొల్లభామల వేషధారణలో అలరించారు.యాదవుల ఆధ్వర్యంలో ప్రధాన కూడలి వద్ద ఏర్పాటుచేసిన ఉట్టి కొట్టే కార్యక్రమం తరలివచ్చిన చిన్నారులు ఉట్టి కొట్టి వేడకలను అంగరంగ వైభవంగా సాగాయి. మంది రంలో ప్రత్యేక పూజలు పూలపల్లి యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ పెద్దలు యువకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## శిథిలావస్థకు వేణుగోపాల స్వామి ఆలయం

**చిన్న శంకరంపేట ఆగస్టు 16 (జనంసాక్షి):** చిన్న శంకరంపేట మండలంలోని అంబాజీపేట గ్రామంలో 200ఏళ్ల చరిత్ర గల వేణుగోపాల స్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. ఆలయం పేరుపై రెండు ఎకరాల భూమి ఉన్నప్పటికీ ధూప దీప నైవేద్యాలకు దూరంగా ఉంది. తమ చిన్నతనంలో గుడి వద్ద పెద్ద కోనేరు ఉండేదని శ్రీకృష్ణాష్టమి రోజున పెద్ద ఎత్తున పూజలు నిర్వహించేవారు అని మాజీ సర్పంచ్ సత్యనారాయణ గుర్తు చేశారు. ఆలయ పూజారి వలస వెళ్లడంతో గుడి ఆదరణ కోల్పోయింది అన్నారు.

## అనారోగ్యంతో మున్సిపల్ మాజీ చైర్మన్ సాక్రే మృతి



**నారాయణపేట జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** నారాయణపేట మున్సి పాలిటీ మాజీ చైర్మన్ రాంచందర్ సాక్రే అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు.ఆయన చిన్నప్పటినుండి ఆర్య సమాజంలో పని చేస్తూ భారతీయ జనతా పార్టీ సంస్థాపక సభ్యునిగా ఉంటూ రెండుసార్లు మున్సి పల్ కౌన్సిలర్ గా చేసి గడ్డం సాయిబన్న మృతి అనంతరం జరిగిన ఉపఎ న్నికలో మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నిక అయి 2002 నుండి 2005 వరకు దాదాపు రెండున్నర సంవత్సరాలు మున్సిపల్ చైర్మన్‌గా మచ్చలేని పరిపా లన అందించారు.అంతే కాకుండా ప్రజల సమస్యలను పట్టణంలో నడు చుకుంటూ తిరుగుతూ సమస్యలు తెలుసుకుని పరిష్కరించడంలో ఆయన పై దళ్ చైర్మన్ గా పేరు గాంచారు.గత కొన్నాళ్లుగా అనారోగ్యం తో బాధపడుతూ చికిత్స పొందుతూ హైద్రాబాద్ లోని ఓ ఆస్పత్రిలో తుది శ్వాస విడిచారు. ఆయన బీజేపీ పార్టీ పుట్టి నప్పటి నుండి క్రియా శీలక కార్యకర్తగా ఉంటూ రామ జన్మభూమి ఉద్యమంలోనూ శ్రీరామ శిలా పూజన శ్రీ రామ కల సేవాసమితి ఉద్యమంలో కూడా క్రియాశీలకంగా పని చేశారు. సమాజానికి సేవలు చేశారు. రాంచందర్ మృతికి బిజెపి రాష్ట్ర సీనియర్ నేత నాగురావు నామాజీ,కే. రతంగ్ పాండురెడ్డి బిజెపి జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్ జిల్లా మాజీ అధ్యక్షుడు పగుదాకుల శ్రీనివాసులు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందు నామాజీ,మాజీ కౌన్సి లర్లు,సంఘ్ పరివార్ నాయకులు,వివిధ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

- ఆకట్టుకున్న చిన్నారుల వేశధారణ...



**ఝరాసంగం, ఆగస్టు16 (జనంసాక్షి):** కృష్ణాష్టమి పర్వదినం పురస్కరిం చుకొని మండల పరిధిలోని పలు గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు.ఏడాకులపల్లి,జీర్లపల్లి, చిలమామిడి, బర్ది పూర్, కుప్పానగర్,చిల్కేపల్లి,గుంతమర్పల్లి, జునేగావ్ గ్రామాల్లో చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు.

## కన్నుల పండువగా .. కృష్ణాష్టమి వేడుకలు



**పాపన్నపేట, ఆగస్టు 16 (జనంసాక్షి):** నార్సింగి శ్రీ సాయి స్కూల్ ఆధ్వర్యంలో ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుక శనివారం అట్టహాసంగా జరిగింది. విద్యార్థుల నృత్యాలు,మహనీయుల వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. శ్రీ కృష్ణుడు..గోపికలతో కలిసి ఉట్టి కొట్టిన దృశ్యం కనువిందు చేసింది. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. నిర్వాహకులు భాస్కర్,నరేష్ ,మహేష్,శివ, ఉపాధ్యాయులు వినోద్,యదులు,శ్రావణి, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

## కేతకీ ఆలయాన్ని దర్శించిన
### మహారాష్ట్ర హైకోర్ట్ జడ్జి



**ఝరాసంగం, ఆగస్టు16 (జనంసాక్షి):** దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన శైవ పుణ్యక్షేత్రమైన శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయాన్ని శనివారం శ్రావణ మాసం సందర్భంగా మహారాష్ట్ర హైకోర్ట్ జడ్జి దేబద్వార్ బాల చంద్ర దర్శించుకున్నారు. ఆలయ అర్చకలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ వెనుకాల గల అమృతగుండంలో పాద ప్రక్షాళన చేసి ఆలయంలో వెలసిన సంగమేశ్వర స్వామిని దర్శించుకున్నారు. శివలంగానికి అభిషేకం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈఓ శివరుద్రప్ప శాలువా పూలమాలతో సన్మానించారు.

# డాక్టర్ పట్ట పొందిన ఐక్య వేదిక అధ్యక్షులు సతీష్ యాదవ్

- గ్లోబల్ ఆక్రిడేషన్ కౌన్సిల్, పాండి యూనివర్సిటీ ఆధ్వర్యంలో డాక్టరేట్ పట్టా



**వనపర్తి టౌన్ ఆగస్టు 16 (జనంసాక్షి):** గ్లోబల్ అక్రిడే షన్ యునైటెడ్ నేషన్నేషనల్ పీస్ యూనివర్సిటీ వారిచే అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ పాండిచ్చేరిలో డాక్టర్ రేట్ పట్ట పొందారు25 సంవత్సరాలుగా వనపర్తి జిల్లా ప్రజల సమాజ సేవకు, ప్రజా సమస్యలపై 18 ఏళ్లపాటు రాజీలేని పోరాటానికి గుర్తింపుగా ఈ గౌరవం దక్కిందని సతీష్ తెలిపారు వనపర్తి కాంగ్రెస్ పార్టీ నుండి మాజీ కౌన్సిలర్,గా సేవలు వనపర్తి జిల్లా అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్ ,గౌరవ డాక్టరేట్ ప్రధానం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కౌన్సిలర్ గా ఉన్నప్పుడు ఇంకుడు గుంతలు తవ్వించడం హరితహారంలో ఒకేసారి మూడు వేల చెట్లు నాటడం ప్లాస్టిక్ వ్యతిరేకంగా బట్ట సంచులు ఉచితంగా ప్రజలకు పంచడం,.కరోనా సమయంలో పోలీసు శాఖకు,మున్సిపల్ కార్మికులకు అన్నదానం చేయడం కార్మికులకు నిత్యావసర సరుకులు పంచడం ఐదు సంవత్సరాలలో ప్రభుత్వ ఆస్తులు రక్షించడం ప్రజా సమస్యలపై పోరాడడం అనేక సేవ లకు గురించి డాక్టరేట్ ఇచ్చారని చెప్పారు. శనివారం పాండిచ్చేరి రాష్ట్రంలో గ్లోబల్ ఆక్రిడేషన్ కౌన్సిల్, పాండి యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు పట్టా అందజేశారు. డాక్టరేట్ అందుకున్న సందర్భంగా సతీష్ యాదవ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై చేస్తున్న సేవా కార్యక్రమాలను గమనించి సేవలకు గుర్తింపుగా గౌరవ డాక్టరేట్ ఇవ్వటం గర్వంగా ఉందని, శ్రీ కృష్ణాష్టమి రోజున పట్ట అందుకోవడం అదృష్టం గా ఉందని అన్నారు. గౌరవానికి దోహదపడిన వనపర్తి పట్టణ, జిల్లా ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని రాబోవు కాలంలో వనపర్తి జిల్లా ప్రజలకు మరింత సేవ చేయడానికి ఉపయోగపడుతుందని తెలిపారు..ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సులర్లు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# 114 మంది యాదవ శౌర్య యోధులను స్మరించడమే ప్రధాన ఉద్దేశం

- వడితం కిరణ్ కుమార్ యాదవ్
- అఖిల భారత యాదవ మహసభ నంగునూరు మండల యాదవ సంఘం అధ్యక్షులు



**నంగునూరు ,ఆగస్టు 16 (జనంసాక్షి):** ఇండియన్ ఆర్మీలో అహిర్ రెజిమెంట్ను ఏర్పాటు చేయాలనిఅఖిల భారత యాదవ మహసభ డిమాండ్ చేస్తుంది. 1962 నవంబర్ 18న చైనాతో జరిగిన యుద్ధంలో 114 మంది యాదవ సైనికులు అమరులయ్యారని వారి త్యాగాలకు సరైన గుర్తింపు లభించలేదని నంగునూరు మండల యాదవ సంఘం అధ్యక్షులు వడితం కిరణ్ కుమార్ యాదవ్ అన్నారు .రేజంగ్ల రాజ్ కళాశాయాత్ర 1962 భారత్ చైనా యుద్ధంలో వీరమరణం పొందిన 114 మంది యాదవ శౌర్య యోధులను స్మరించుకుంటూ అఖిల భారత యాదవ మహసభ నంగునూరు మండల యాదవ సంఘం ఆద్వర్యంలో యాదవ కుల భాందవులందరం కలిసి స్వాగతం పలుకడం జరిగింది వారు మాట్లాడుతూ అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో రేజంగ్ల రాజ్ కళాశాయాత్ర 2025 ఏప్రిల్ 13న బీహార్ రాష్ట్రంలోని చాప్రా జిల్లా నుండి ప్రారంభమైంది ఈ యాత్ర 1962 భారత్ చైనా యుద్ధంలో వీరమరణం పొందిన 114 మంది యాదవ శౌర్య యోధులను స్మరించడమే ప్రధాన ఉద్దేశంగా కొనసాగుతుంది బీహార్ నుండి ప్రారంభమైన యాత్ర ఝూర?ండ్ పశ్చిమబెంగాల్ ఛత్తీస్గడ్ ఒడిశా ఆంధ్రప్రదేశ్ తమిళనాడు కేరళ పుదుచ్చేరి కర్ణాటక తెలంగాణ మహారాష్ట్ర గుజరాత్ మధ్యప్రదేశ్ రాజస్థాన్ ఉత్తర ప్రదేశ్ హర్యానా రాష్ట్రాలలో కొనసాగుతుంది ఈ కళాశాయాత్ర నవంబర్ 18 వ తేదీన ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద మూయనుంది అక్కడ దేశం నలుమూలల నుండి వచ్చిన నాయకులతో కలిసి అహిర్ యాదవ రెజిమెంట్ పున స్థాపన కోసం డిమాండ్ చేయబడుతుంది యాత్ర దేశభక్తి శౌర్య గాతల అభివృద్ధి యాదవుల మలుపు తిరిగిన చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లే మహత్తర కృషిగా నిలుస్తుంది. అని అన్నారు.ఈ కార్యక్రమంలో నంగునూరు మండల యాదవ సంఘం అధ్యక్షులు వడితం కిరణ్ కుమార్ యాదవ్ గుండెలి రాజయ్య యాదవ్ వర్ధోల్ వేణు చక్రవర్తి యాదవ్ ఎల్పుల ఐలయ్య యాదవ్ బొల్లు తిరుపతి యాదవ్ చెలికాని మల్లేశం యాదవ్ పరశురాములు యాదవ్ ఆంజనేయులు యాదవ్ మల్లేశం యాదవ్ వెంకటేష్ యాదవ్ శ్రీనివాస్ యాదవ్ వివిధ గ్రామాల యాదవ కుల భాందవులు తదితులున్నారు.

## ఎమ్మెల్యేగా కొనసాగే నైతిక హక్కు హరీష్ రావుకు లేదు

- టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి



**నంగునూర్, ఆగస్టు 16 (జనంసాక్షి):** ఎమ్మెల్యేగా కొనసాగి నైతికకు హక్కు హరీష్ రావుకు లేదని సిద్దిపేట ఎమ్మెల్యే పదవికి హరీష్ రావు రాజీనామా చేయలని టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి డిమాండ్ చేశారు.శనివారం నంగునూర్‌లో విలేకరులతో సమావేశంలో మాట్లాడుతూ..సిద్దిపేట నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలిచిన హరీష్ ప్రజల కష్టసుఖాలు పట్టించుకోవడంలో పూర్తిగా విఫలం చెందరిని దుయ్యబట్టారు. తెలంగాణా రాష్ట్రవ ఖలో ప్రజా పాలనలో అభివృద్ధి పరుగులు పెడుతుంటే చూసి జిర్ణిం చుకోలేక దొంగ ధర్నాలు చెపిస్తూ కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నారని మండి పడ్డారు.పక్కన ఉన్నా హుస్నాబాద్ అభివృద్ధి లో దూసుకు పోతుంటే సిద్దిపేట నియోజక వర్గం అభివృద్ధి గురించి, ఓట్లేసిన ప్రజల గురించి పట్టించుకోని చేతకాని దద్దమ్మ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చెయ్యాలని డిమాండ్ చేస్తున్నాం. పనిచేతగాని హరీష్ రావు కు ఎమ్మెల్యే గా కొనసాగే నైతిక హక్కు లేదని తక్షణమే రాజీనామా చెయ్యాలని డిమాండ్ చేశారు.హరీష్ రావు రాజీనామా చేస్తే సిద్దిపేట నియోజకవర్గన్ని అన్ని విధాలుగా అభివృద్ధిచేసుకుంటామని పేర్కొన్నారు.

## వర్షానికి కూలిన ఇంటి గోడ

- తప్పిన ప్రాణ నష్టం



**ఝరాసంగం, ఆగస్టు 16 (జనంసాక్షి):** గత వారం రోజులుగా వరుసగా కురుస్తున్న వర్షాలకు ఝరాసంగం మండల కేంద్రంలో 11వ వార్డులోని నక్క సంగమేశ్వర్ ఇంటి గోడలు కూలిపోయాయి.ప్రమాద సమయంలో కుటుంబ సభ్యులు ఇంట్లోనే ఉన్నారు. ఇంటి గోడ వెనక భాగం పడటంవల్ల ప్రాణ నష్టం తప్పిందని కాలనీవాసులు తెలిపారు. ఎడతెరిపిలేని ముసురు కమ్మి కురుస్తున్న వర్షాలకు గోడలు పూర్తిగా దెబ్బతిని కూలిన ట్లుగా స్థానికులు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుడు ప్రభుత్వాన్ని వేడుకున్నాడు.

## బీజేపీ జిల్లా కార్యదర్శిగా అశోక్




**శివ్వంపేట ఆగస్ట్ 16 (జనంసాక్షి) :** మండల పరిధిలోని ఉసిరికపల్లి గ్రామానికి చెందిన అశోక్ సాదుల ను బీజేపీ జిల్లా కార్యదర్శిగా నియామిస్తూ బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని అశోక్ సాదులకు అందించి ఘనంగా సన్మానించారు. అనంతరం బిజెపి జిల్లా అధ్యక్షులు మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ అశోక్ సాదుల పార్టీలో ఎల్లప్పుడూ క్రియాశీలకంగా పనిచేస్తూ, పార్టీ పటిష్ట కోసం కృషి చేస్తున్నారన్నారు. వారి గుర్తించి, పదవి బాధ్యతలు అప్పజెప్పడం జరిగిందన్నారు. అనంతరం నూతనంగా బీజేపీ జిల్లా కార్యదర్శి ఎన్నికైన అశోక్ సాదుల మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పార్టీ పదవి బాధ్యతలు అప్పగించిన భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావుకు, మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు కు, జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పాపగారి పెద్ద రమేష్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు ఎరుకల భిక్షపతి గారు, బుచ్చేష్ యాదవ్, కాజీపేట రాజేందర్, సత్యనారాయణ, నాగరాజు, నారాయణ రెడ్డి, బాల్ రాజ్, అరవింద్, బాల మల్లేష్, శ్రీనివాస్ గౌడ్, దాసు, మహిపాల్ త పాల్గొన్నారు.

# నిరుపేదల ఆరోగ్యానికి అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

- **జులై నెలలో 29 ఎల్ఓసిలు,239 సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**



**వనపర్తి బ్యూరో ఆగస్టు 16 (జనంసాక్షి):** వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి నియోజకవర్గ పరిధిలోని నిరుపేదల ఆరోగ్యానికి అండగా నిలుస్తున్నారు. ఆర్థిక స్తోమత లేక తాము మెరుగైన వైద్యం చేయించుకోలేకపోతున్నామని తనను ఆశ్రయించిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం తరపున వారి చికిత్సకు సరిపోయేంత ఎల్ఓసి లను మంజూరు చేయించి తన మానవత్వాన్ని . వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి చాటుకున్నారు.జూలై నెల 30 రోజుల్లో రోజుకో ఎల్ వో సి చొప్పున 29 మంజూరు చేయించారు.అదేవిధంగా జులై నెలలో రూ. 68 లక్షల 80 వేల విలువగల 239 సీఎంఆర్ఎఫ్ చెక్కులను సైతం ఎమ్మెల్యే మంజూరు చేయించారు.ఈ సందర్భంగా ఆయన రేవల్లి మండలం నాగపూర్ గ్రామానికి చెందిన కల్వకోలు సత్యం, మెరుగైన వైద్యం చేయించుకునేందుకు రూ. 5లక్షలు, ప్రస్తుతం మరో రూ.3 లక్షలు మొత్తం రూ.8 లక్షల విలువగల ఎల్ఓసిని బాధిత కుటుంబానికి అందజేశారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.పార్టీలకతీతంగా తన, మన బేధం లేకుండా ఆపదలో ఉన్నానంటే ఆయన ఆలోచించకుండా అపన్న హస్తము అందిస్తూ వస్తున్నారు.ఈ విధంగా ఒక్కో నెలలో రోజుకు ఒకటి, రెండు చొప్పున,300 నుంచి 400 సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంజూరు చేయిస్తూ నిరుపేదల ఆరోగ్యాభివృద్ధికి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ఎంతో తోడ్పాటును అందిస్తున్నారని, నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## స్వయంభు శ్రీ కృష్ణ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



**మల్దకల్ ఆగస్టు 16 (జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం సద్దలోనిపల్లి గ్రామంలోని శనివారము స్వయంభు శ్రీకృష్ణ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి.ఉదయం 6 గంటలకు బిందెసేవ, స్వామివారికి అభిషేకం రాత్రి 12 గంటలకు కృష్ణ స్వామి జననం,భాగవతం,గీతా పారాయణం,ప్రభోత్సవం,తీర్థ ప్రసాద వితరణ జరిగాయి. మూడు రోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాలకు దేవాదాయ ధర్మాదాయ శాఖ అన్ని ఏర్పాట్లును పూర్తి చేసింది. ఆయాగ్రామాల నుండి భక్తులు భక్తాదులు స్వామివారిని దర్శించుకోవడానికి ఇక్కడ వచ్చి మొక్కుబడులను తీర్చుకున్నారు.ఆలయ ఈవో పురేందర్ కుమార్ గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా జరిగాయి. స్వామి వారిని దర్శించుకోవడానికి భక్తులు వివిధ ప్రాంతాల భారీ ఎత్తున తరలి వచ్చారు. దాదాపు కిలోమీటర్లు మీటర్ కిలోమీటర్ వరకు క్యు లోనిలబడి దర్శిం చుకున్నారు. దేవాలయం వద్ద భక్తులను కంట్రోల్ చేయలేక కిటకిటలాడి ఇబ్బందులు గురయ్యారు.

## అమీరాబాద్‌లో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



**న్యాల్ కల్, ఆగస్టు 16, (జనంసాక్షి) :** శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకను మండలంలోని అమీరాబాద్ గ్రామంలో భక్తులు ఘనంగా జరుపుకున్నారు. గ్రామానికి చెందిన భక్తులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. వేద పండితులు శ్రీకృష్ణ భగవానునికి సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అమీరాబాద్ గ్రామంతో సమీపంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు ఎంతో విశిష్టత కలిగిన శ్రీకృష్ణ మందిరానికి ప్రతి ఏటా తరలివచ్చి దర్శించుకుంటారు. కార్యక్రమంలో భక్తులు డాక్టర్ విజయకుమార్ పాటేల్, అశోక్ రావు పాటిల్, ఏక్ నాథ్ రావు పాటిల్, అవినాష్, జగదీష్, దొండిభ, ప్రభు, సిద్దు, కృష్ణ, దత్తు, పాల్గొన్నారు.

## శాంతినికేతన్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి సంబరాలు




**సంగారెడ్డి, ఆగస్టు 16 (జనంసాక్షి):** సదాశివపేట పట్టణంలోని శాంతి నికేతన్ విద్యాల యంలో శనివారం విద్యార్థులు శ్రీకృష్ణ జన్మాష్టమి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉల్లాసంగా ఉట్టి కొట్టె కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ అరవింద శ్రీ, కరస్పండెంట్ మాలిపటల్ ప్రభు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లోకనాథ్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

- **గిరిజన జాతిని అవమానించిన మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లోక్నాథ్ రెడ్డి**
- **గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు తిరుపతి నాయక్ డిమాండ్**



**రేవల్లి, ఆగస్టు 16 (జనంసాక్షి) :** కొత్తగా ఏర్పడినటువంటి ఏదుల మండలంలో భారతీయ జనతా పార్టీ మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ రాక సందర్భంగా రేవల్లి మండల బీజేపీ అధ్యక్షులు బాలునాయక్ కు ఎలాంటి సమాచారం లేకుండా వనపర్తి జిల్లా పరిషత్ చైర్మన్ మాజీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి కార్యక్రమం నిర్వహించారు. ఒక లంబాడ సామాజిక వర్గానికి చెందిన వారు కాబట్టే ఎలాం టి సమాచారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి వెంటనే ఈ కార్యక్రమం నడిపించినట్టి వనపర్తి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని భారతీయ జనతా పార్టీ గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు తిరుపతి నాయక్ డిమాండ్ చేశారు. క్షమా పణ చెప్పకపోతే త్వరలోనే లోక్నాథ్ రెడ్డి ఇంటికి ముట్టడి చేస్తామని తిరుపతి నాయక్ డిమాండ్ చేశారు.

## వైభవంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



**చారకొండ, ఆగస్టు 16 (జనంసాక్షి):** మండలం కేంద్రంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా శుక్రవారం ఉదయం నుంచి చిన్నారులకు కృష్ణుడు గోపికల వేషాధరణలతో ముస్తాబై సరాదగా గడిపారు. ఉట్టి కొట్టి చిన్నారులు సంబరప డ్డారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కృష్ణుడికి పూజలు చేశారు. గ్రామాలలో చిన్నారులకు కృష్ణుడి వేషా దారంలో పాల్గొని అందర్నీ ఆకట్టుకున్నారు. మహిళలు గోపికల వేషధారణలతో అలరించారు. అయోధ్య నగర్ శ్రీ శిరసన గండ్ల సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణాలు విద్యుత్ దీపాలతో, శ్రీకృష్ణుని జానపద కీర్తనలతో వినిపిం చాయి. సీతారా మచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించారు. భక్తులు విస్తారంగా హాజరై స్వామివారిని దర్శించు కున్నారు. గ్రామా లలో చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ పాల్గొని పండుగను ఘనంగా జరుపుకున్నారు.

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**సిద్దిపేట, ఆగస్టు 16 (జనంసాక్షి):** సిద్దిపేట పట్టణంలోని వికాస్ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకొని కాలనీలో వేడుకలు చిన్నారులతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణుని, గోపిక అలంకరణలో,చిన్నారులు ఉట్టి ఆడుతూ , కాలనీ వాసులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

# వరద ఉధృతిపై నిఘా



**పాపన్నపేట, ఆగస్టు 16 (జనంసాక్షి) :** ఏడుపాయలలో వరద ఉధృతిపై మెదక్ జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. సింగూరు ప్రాజెక్టు నుండి నీరు వదలడంతో వనదుర్గా ప్రాజెక్టుకు చేరడంతో వరద ప్రవాహం పెరిగింది. గురువారం ఆలయ గర్భగుడి మూసివేశారు. దీంతో శుక్రవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ క్షేత్రస్థాయిలో పరిశీలించి యంత్రాంగానికి దిశ నిర్దేశం చేశారు. శనివారం వనదుర్గా ప్రాజెక్ట్ ను, వరద పరిసర ప్రాంతాలను మెదక్ అదనపు కలెక్టర్ మెంచు నగేష్,ఎస్పీ డీవీ శ్రీనివాస రావు,అదనపు ఎస్పీ మహేందర్ వేరు వేరు సమయాలలో.. మెదక్ డిఎస్పీ ప్రసన్నకుమార్,రూరల్ సిఐ రాజశేఖర్ రెడ్డి,స్థానిక ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తో కలిసి తాజా పరిస్థితిని పరిశీలించారు. అధికారుల సూచనల మేరకు విధులు నిర్వహించాలని సిబ్బందికీ ఆదేశించారు. అ ప్రాంతాన్ని సుమారు 50 మంది ఎస్డిఆర్ఎఫ్,ఔట్ పోస్ట్,పోలీస్ సిబ్బంది గట్టి బందోబస్తు చేపట్టారు. ఆలయ రాజగోపురంలో అర్చకులు అమ్మవారి ఉత్సవ విగ్రహానికి మూడవ రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు . భద్రత దృష్ట్యా భక్తులు ఏడుపాయల ప్రయాణం మూడు రోజులు వాయిదా వేసుకోవాలని ఆలయ ఈవో చంద్రశేఖర్ సూచించారు.

## స్వాతంత్ర్య దినోత్సవం రోజు
# మున్సిపల్ సిబ్బంది చిందులు



**చేర్యాల ఆగష్టు 16 (జనంసాక్షి) :** సిద్దిపేట జిల్లా చేర్యాల మున్సిపాలిటీలోని అధికారులు స్వతంత్ర దినోత్సవం రోజు జండా ఆవిష్కరించిన అనంతరం దేశభక్తి గురించి, దేశం కోసం పోరాడి ప్రాణాలర్పించిన స్వతంత్ర సమరయోధుల జీవిత గాథలను, పోరాట పటిమ గురించి మాట్లాడుకోవాల్సింది పోయి, మున్సిపల్ అధికారులు సినిమా పాటలు పెట్టుకొని చిందులు వేశారు. ఈ ఘటనతో ఒక్కసారిగా స్థానికులు ఆశ్చర్యపోయారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అధికారులం దరూ జెండావిష్కరించిన అనంతరం అందరూ ఒకచోట కూర్చుని సౌండ్ సిస్టం ఏర్పాటు చేసుకొని ఒకరి తర్వాత ఒకరు సినిమా పాటల కు చిందులు వేశారని తెలిపారు. ఈ సంఘటనపై దీనిపై వెంటనే ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## శ్రీ తిమ్మప్ప స్వామికి భక్తుల పూజలు



**మల్దకల్ ఆగస్టు 16(జనంసాక్షి):** ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి మొక్కులు తీర్చుకున్నారు. దేవాలయ ఈవో సత్య చంద్రారెడ్డి ఆధ్వర్యంలో బల్లారికి చెందిన వరలక్ష్మి,శంకర్ రెడ్డి దంపతులు అన్న దానం ఏర్పాటు చేసి పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో అరవింద్ రావు, చంద్రశేఖర రావు,చంద్రశేఖర్ రెడ్డి,అర్చకులు రవి చారి,వాల్మీకి పూజారులు, దేవాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసం చేసిన నిందితులను అరెస్టు చేయాలి

- రజక సంఘం జిల్లా నాయకులు దత్తు



**ఝరాసంగం,ఆగస్టు16(జనంసాక్షి):** నిర్మల్ జిల్లా తాందూర్ మండలం భోసి గ్రామంలో భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి ముక్తి కోసం దొరలపై వీరోచితంగా పోరాడిన చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయగా గత అర్థ రాత్రి దుండగులు విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ఈ విషయాన్ని గ్రామస్తుల ద్వారా సమాచారం తెలుసుకున్న సంగారెడ్డి జిల్లా రజక సంఘం నాయకులు సి. హెచ్ దత్తు నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటన పునరావితం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# కౌడిపల్లి లో కామ్రేడ్ విట్టల్ రెడ్డి,109వ జయంతి

- విటల్ రెడ్డి మన మధ్యన లేకపోయినా ఆయన ఆశయాలు బతికే ఉన్నాయి
- జిల్లా గ్రంథాలయ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి,



**కౌడిపల్లి ఆగస్టు16,(జనంసాక్షి):** కామ్రేడ్ మాజీ శాసనసభ్యులు చిలుముల విట్టల్ రెడ్డి 109వ జయంతి సందర్భంగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, కౌడిపల్లి లోని విట్టల్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...విట్టల్ రెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని, ఆయన గతంలో ఎమ్మెల్యేగా పనిచేసినప్పుడు ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. పేదప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా ఆ మహనీయుని సేవలు మరువలేనివని విట్టల్ రెడ్డి, హయంలో గ్రామ గ్రామాన ఆయన సేవలు నిరుపేదలకు అందించిన గొప్ప మహనీయుడు విట్టల్ రెడ్డి, అన్నారు. ఆ మహనీయుని సేవలు గుర్తుచేస్తూ ఆయన అడుగుజాడల్లో నడుస్తామని తెలిపారు. జై కామ్రేడ్ జై జై కామ్రేడ్ అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కౌడ శ్రీనివాస్ గుప్తా, ప్రముఖ సంఘ సేవకులు బండారి గంగాధర్, చిరంజీవి, శ్రీనివాస్, జగన్, రాజు, సునీల్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్లను పెంచి ఇచ్చిన మాట నిలుపుకోవాలి

- ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పానుగంటి సిద్దు



**లింగాల ఆగస్ట్ 16 (జనంసాక్షి):** నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండల కేంద్రంలో శాయిన్ పేట్ గ్రామంలో , వృద్ధులకు, వితంతువులకు, చేనేత బీడీ ,కార్మికులకు వికలాంగులకు పెన్షన్ పెంచుతామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షులు పానుగంటి సిద్దు మాదిగ డిమాండ్ చేశారు. శనివారం ఈ నెల 26న అచ్చంపేటలో నిర్వహించబోయే నియోజకవర్గ నియోజకవర్గ శాయిన్ పేటలో పెన్షన్ దారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగుల పెన్షన్ రు.6000, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత గీత, బీడీ కార్మికులు, డయాలసిస్,హెచ్ఐవి రోగులకు రూ. 4000, కండరాల క్షీణత రోగులకు రూ.15000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. 26 న అచ్చంపేటలో సాయంత్రం 4 గంటలకు జరిగే సమావేశానికి మందకృష్ణ మాదిగ హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ , ఎంఎస్పి అనుబంధ సంఘాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వృద్ధుడు వితంతువులు వికలాంగులు ఒంటరి మహిళల గ్రామ కమిటీని నియమించారు.

# కొండంత బలగం.. ఆనందాల హరివిల్లు బొందుగుల కుటుంబం



**చేర్యాల ఆగష్టు 16 (జనంసాక్షి) :** గజిబిజి జీవితాలు ప్రతి ఒక్కరికి జీవితాలలో వేర్వేరుగా ఉంటాయి. కొందరికి పనిలో మరికొందరికి కుటుంబంలో, చాలా మందికి ఆర్థిక సమస్యలు. ఇలా ఏ కారణం చేతనైనా, గజిబిజి జీవితాలు వ్యక్తి యొక్క మానసిక, శారీరక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ఈ రోజుల్లో చాలా మంది తన బాధలను,సంతోషాలకు పంచుకోవడానికి సమయం లేక ఒత్తిడికి గురవుతూన్నారు. గ్రామాలలో ఒక నానుడి ఉంది మంచైనా,చెడైనా చెప్పుకోవడానికి మనకంటూ ఒకరు ఉండాలి అని, అలాంటి ఆలోచన నుండి పుట్టిందే ఫ్యామిలీ గెట్ టూ గెదర్ కుటుంబంలోని వారందరూ ఒక్కదగ్గర చేరడం. కుటుంబం అంత ఒక్క చోట చేరితే ఆ ఆనందమే వేరు.. అలాంటి ఆనందాలను కుటుంబాలన్నీ ఒకే దగ్గర చేరి ఒకరికి ఒకరం తోడుగా ఉన్నాం తెలుపుతూ గత కొన్ని సంవత్సరాలుగా అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు వీరన్నపేటకు చెందిన బొందుగుల వంశస్థులు.ఒక్కప్పుడు ఒకే కుటుంబం అయిన తాతలు,వారి కొడుకులు విడిగా ఎవరి కుటుంబం వారే అన్నట్టు ఉండే వారు..పిల్లల చదువులు, ఉద్యోగాల పేరుతో ఎక్కడో కుటుంబాలకు దూరంగా బ్రతుకుతూ కుటుంబాల విలువలను,వారి కుటుంబ పెద్దలను వారి పిల్లలకు తెలిపేలా అందరూ ఒక్క చోట చేరి ఆనంద క్షణాలను అపురూపంగా వారి మదిలో నింపుకో వాలనే ఆలోచన నుండి పుట్టి, గత కొన్ని సంవత్సరాలుగా సంవత్సరంలో ఒకరోజు కచ్చితంగా ఎవరు ఎక్కడ ఉన్నా గ్రామానికి వచ్చి అందరూ ఒక చోట చేరి కుటుంబంతో గడపాలని నిశ్చయించుకున్నారు. అందులో భాగం గానే ఈనెల ఆగస్టు 15వ తేదీ నాడు బొందుగుల కుటుంబం అంతా దాదా పు 20 పైగా కుటుంబాలతో 100 మంది పెద్ద,చిన్న అంత ఒకచోట చేరి ఆట పాటలతో ఆనంద క్షణాలను ఒకరికొకరు పంచుకున్నారు. వీరి కల యికను చూసి గ్రామస్తులు కుటుంబాలతో కలవాలనే ఆలోచన పడుతున్నారు.

# అధికారుల తీరుతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు

- బారాస సీనియర్ నాయకులు ముంత మల్లయ్య యాదవ్



**వీపనగండ్ల, ఆగస్టు 17(జనంసాక్షి):** వీపనగండ్ల మండల కేంద్రానికి చెందిన ఎస్సీ గురుకుల పాఠశాలను మండల కేంద్రంలో వసతులు లేని కారణంగా కొత్తకోటలో నిర్వహిస్తున్న సంగతి ఇంతకుముందు తెలిసిందే. ప్రస్తుత విద్యా సంవత్సరానికి జూనియర్ కళాశాలలో ప్రవేశం పొందడానికి వస్తున్న విద్యార్థులకు వసతులు లేని కారణంగా పాఠశాల ప్రిన్సిపల్ కొత్తకోట పరిసర ప్రాంతాల్లోని ఇతర జూనియర్ కళాశాలకు పంపించడంతో విద్యార్థులకు తీవ్ర ఆందోళనకు గురి చేస్తుందని మండల రైతు బంధు సమితి సమన్వయ మాజీ అధ్యక్షుడు ముంత మల్లయ్య యాదవ్ ఆరోపించారు. శనివారం పాఠశాలను సందర్శించిన బారాస నాయకులు ముంత మల్లయ్య యాదవ్, యువ నాయకులు ముంత శివ యాదవ్ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం అయ్యారు.తమ పిల్లలను ఈ కళాశాలలో ప్రవేశం తీసుకుంటుంటే ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని బాధను చెప్పుకున్నారు. సమస్య పైన స్పందించిన బారాస నాయకులు పాఠశాల ప్రధానోపాధ్యాయునితో మాట్లాడగా పాఠశాలలో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్నదని విద్యార్థుల సంఖ్యకు అనుకూలంగా వసతులు లేవని చెప్పగా బారాస నాయకులు బిల్డింగ్ యజమానితో మాట్లాడగా ఒకటి రెండు నెలలలో తరగతులకు గదులు నిర్మిస్తామని చెప్పినట్లు తెలిపారు.ప్రధానోపాధ్యాయునితో విద్యార్థులను వసతులు లేని కారణంగా ఇతర ప్రాంతాలకు తరలించవద్దని త్వరలోనే బిల్డింగ్ యజమాని తరగతుల గదుల నిర్మాణాన్ని ఒప్పుకున్నట్లు తెలిపారు. ఇతర ప్రాంతాలకు తరలిస్తే విద్యార్థులు చదువు ఆగమ్య గోచరంగా మారుతుందని అన్నారు. సమస్య పైన స్పందించి సమస్యను పరిష్కరించిన బారాస నాయకులకు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసాల నాగరాజు, బారాస యువ నాయకులు ముంత శివ యాదవ్ శేఖర్,బాలకృష్ణ,చంటి, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు మీసాల శీను,డప్పు నాగరాజు,పాము నాగులు,మీసాల గంగోలి,పాల్,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

- త్రైత సిద్ధాంత ప్రబోధ సేవ సమితి హిందూ జ్ఞానవేదిక అద్వర్యంలో విజయవంతం



**మానవపాడు, ఆగస్టు 16 (జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా, అలంపూర్ నియోజకవర్గం. ఉండవల్లి మండల పరిధిలోని.. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవ సమితి హిందూ జ్ఞాన వేదిక తక్కశిలలో వైభవంగా శ్రీకృష్ణ భగవానుడి ఊరేగింపు కార్యక్రమం దిగ్విజంగా చేశారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవ సమితి హిందూ జ్ఞాన వేదిక తక్కశిల కమిటీ ఆధ్వర్యంలో శంకరమ్మ ఇంటి వద్ద వేదిక నిర్మించి శ్రీకృష్ణ జన్మాష్టమి రోజున శ్రీకృష్ణ ప్రతిమను కొలువు తీర్చి శ్రీకృష్ణ భగవాన్ ప్రతిమ ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఊరేగింపు భక్తుల కోలాటాలతో, సన్నాయిలతో, భగవద్గీత శ్లోకా నినాదాలతో జయ జయ ద్వానాలు మధ్య ఊరేగింపు జరిగింది. గ్రామ పెద్దలు మధు రెడ్డి, ఆనంద్ గౌడు, జి స్వాములు, బిసన్న లు పల్లకి సేవ లో పాల్గొన్నారు, దేవుడే మనిషిగా అవతరించి మనిషిగా జన్మిస్తే ఆయనను భగవంతుడు అని అంటాం. అలాంటి భగవంతుడే శ్రీకృష్ణుడు ఆయనను మాత్రమే అందరూ దైవంగా గుర్తించాలని ఊరిలోని వారందరికీ తెలియపరచుటకు ఈ ఊరేగింపు చేస్తున్నామని త్రైత సిద్ధాంతం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు జీ వెంకట్రాముడు శనివారం తెలిపారు. ఈ క్రమం లో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవ సమితి ఇందు జ్ఞాన వేదిక తక్కశిల ఉత్సవ నిర్వాహకుడు, తక్కశిల కమిటీ అధ్యక్షుడు జీ వెంకట్రారాముడు, ఉపాధ్యక్షుడు జి కృష్ణ, సభ్యులు శంకరమ్మ, కార్తీక్, శ్రీకృష్ణ, పద్మమ్మ, స్వప్న, లక్ష్మీదేవి, లిఖిత్, తదితరులు ఉన్నారు.

# భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు

- బైక్ ర్యాలీలతో ఆంజనేయ స్వామి దర్శనం



**మహమ్మదాబాద్/గండీడ్, ఆగస్టు16 (జనంసాక్షి) :** శ్రావణమాసం చివరి శనివారం కావడంతో మండల వ్యాప్తంగా ఆయా గ్రామాలలో భక్తులతో ఆలయాలు కిక్కిరిసిపోయారు. హిందువుల పవిత్రమైన మాసమైన శ్రావణమాసం ఎంతో భక్తిశ్రద్ధలతో ఉపవాసన దీక్షలు చేపడుతూ ఆలయాల దగ్గరకు వెళ్లారు.మాసం చివరి శనివారం కావడంతో,మండల పరిధిలో మహమ్మదాబాద్ శివాలయం గంగార్లపహాడ్ ఆంజనేయస్వామి ఆలయం గాధిర్యాల్ వీరహనుమాన్ ఆలయాలతో పాటు ఆయా గ్రామాలలో ఆలయాలని భక్తులు దర్శించుకున్నారు. ఆయా మండలాలకు చెందిన భక్తులు బైక్ ర్యాలీలతో వచ్చి గాధిర్యాల్ ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు.జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేసుకుంటూ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

# 12 సెంటీమీటర్ల వర్షం

- జలకళ సంతరించుకున్న చెరువులు

**శివ్వంపేట ఆగస్ట్ 16 (జనంసాక్షి):** మండల కేంద్రమైన శివ్వంపేట తో పాటు మండలం లోని అన్నీ గ్రామాల్లో ఏకదాటి గా కురిసిన వర్షానికి చెరువులు కుంటలలో జలకళ సంతరించుకుంది. శనివారం రాత్రి కురిసిన వర్షానికి శివ్వంపేటలో 12.8 వర్షపాతం నమోదయింది. దీంతో చెరువుల్లో పెద్ద ఎత్తున నీరు రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే మండలంలో చెరువులు కుంటాల్లోకి పెద్ద ఎత్తున నీరు వచ్చి చేరడంతో కొన్ని చెరువులు అలుగు పారుతుండగా మరో కొన్ని చెరువులు అలుగు పారడానికి సిద్ధంగా ఉన్నాయి.